Namasthe Telangana Dt 21/04/18.

# 7 నిమిషాలకో మెట్రో రైలు



- నేటి నుంచి మరింత స్పీడ్
- పచ్చజెండా ఊపిన సీఎంఆర్ఎస్
- పెరుగనున్న రైళ్ల వేగం, ఫ్రీక్వెన్సీ

11

# నేటి నుంచి మెట్రో మరింత స్పీడ్

- పచ్చజెండా ఊపిన సీఎంఆర్ఎస్
- పెరుగనున్న రైళ్ల వేగం, ఫ్రీక్వెన్సీ
- రద్దీ సమయాల్లో ప్రతి ఏడు నిమిషాలకో రైలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** నాగోల్ నుంచి మియాపూర్ మార్గంలో శనివారం నుంచి మెట్రోరైళ్ల వేగం పెరుగనున్నది. ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపింది. కమిషనర్ ఆఫ్ మెట్రో రైల్వే సేఫ్టీ (సీఎంఆర్ఎస్) తనిఖీలు పూర్తిచేయడంతోపాటు సీబీటీసీ టెక్నాలజీని వినియోగించవచ్చని చెప్తూ సీఎంఆర్ఎస్ చీఫ్ రాంక్రిపాల్ మెట్రోరైలుకు ధ్రువీకరణ పత్రం అందించారు. గతంలో మెట్టుగూడ నుంచి అమీర్‌పేట వరకు సీఎంఆర్ఎస్ అనుమతులు లేకపోవడంతో రైళ్ల వేగాన్ని తగ్గించారు. ఇప్పుడు సీఎంఆర్ఎస్ పచ్చజెండా ఊపడంతో మెట్రో రైళ్ల వేగం, ఫ్రీక్వెన్సీ పెరుగనున్నది. దీంతో ప్రయాణ సమయం తగ్గనున్నది. ప్రస్తుతం నాగోల్ నుంచి మియాపూర్‌కు చేరడానికి 60 నిమిషాల సమయం పడుతున్నది. రైళ్ల వేగం పెంపుతో 55 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. అంతేకాకుండా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు గల పీక్‌అవర్స్‌లో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరిగి ప్రతి ఏడు నిమిషాలకు ఒక రైలు అందుబాటులోకి రానున్నది. నాన్ పీక్ అవర్స్‌లో ఎనిమిది నిమిషాలకు ఒక రైలు అందుబాటులో ఉంటుంది. సవరించిన ప్రయాణ సమయం ప్రకారం నాగోల్ నుంచి సికింద్రాబాద్‌కు 16 నిమిషాలు, నాగోల్ నుంచి అమీర్‌పేట్‌కు 32 నిమిషాలు, నాగోల్ నుంచి మియాపూర్‌కు 55 నిమిషాల్లో చేరవచ్చు.

**డిమాండ్‌కు అనుగుణంగా నిర్ణయం: ఎన్వీఎస్ రెడ్డి**

ప్రయాణికుల డిమాండ్‌ను అనుగుణంగా భవిష్యత్‌లో రైళ్ల ఫ్రీక్వెన్సీ మరింత పెంచుతామని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం వేగాన్ని పెంచేందుకు నిర్ణయించామన్నారు. ఎల్ అండ్ టీ ఎండీ , సీఈఓ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ.. నగర ప్రజలకు ఉత్తమ ప్రయాణ సౌకర్యాన్ని అందించడంలో భాగంగా ఫ్రీక్వెన్సీ పెంచామన్నారు.

## ప్రతి ఏడు నిమిషాలకు ఒక రైలు



మెట్రో ప్రయాణికులకు రద్దీ సమయాల్లో ప్రతి ఏడు నిమిషాలకు ఒక మెట్రో రైలు అందుబాటులో ఉంటుందని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. కొత్త సిగ్నలింగ్ వ్యవస్థకు సీఎంఆర్ఎస్ అనుమతి ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. నాగోల్-మియాపూర్ మార్గంలో పీక్ అవర్స్‌లో ప్రతి ఏడు నిమిషాలకు, నాన్ పీక్ అవర్స్‌లో ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక రైలు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ నిర్ణయం శనివారం ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు.